సరిలేరు.. మీకెవ్వరు

- సేవా కార్యక్రమాల్లో దూసుకుపోతున్న దాతలు
- ప్రజల కోసం నదుపాయాల కల్పన
- ఆర్వో ప్లాంట్ ఏర్పాటుతో ప్రజలకు రక్షిత తాగునీరు
- మున్సిపల్ సచివాలయానికి ప్రహరీ నిర్మాణం


గణపతినగర్ పార్కు వద్ద విశ్రాంతి తీసుకునేందుకు ఏర్పాటు చేసిన బెంచీలు

తుని: ప్రతి పని ప్రభుత్వం చేయడం కష్టం. ప్రజల కోసం పరితపించే దాతలు భారీ విరాళాలు ఇచ్చి ఉదారతను చాటుకుంటున్నారు. ప్రజలకు మినరల్ వాటర్ అందించాలన్న ఉద్దేశంతో ఒకరు రూ.లక్షలు వెచ్చించి ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారు. మరొకరు మున్సిపల్ సచివాలయం, ఐసీడీఎస్ కార్యాలయానికి రక్షణ గోడ నిర్మించారు. మార్నింగ్ వాకింగ్ చేస్తున్న వాకర్లు సేద తీరేందుకు సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. ఇలా సేవా కార్యక్రమాల వైపు దాతలు దృష్టి సారించడం శుభ పరిణామం. వీరిని స్ఫూర్తిగా తీసుకొని మరి కొందరు ముందుకు వస్తున్నారు.

ప్రజలకు శుద్ధి చేసిన నీరు

స్థానిక బాడవ తోట మున్సిపల్ పార్కులో దాత పెనుగొండ తిరుపతయ్య తన సతీమణి కృష్ణ కుమారి జ్ఞాపకార్థం రూ.4 లక్షలతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. దీని ద్వారా బాలాజీ రోడ్డు, పాత బజారువీధి, బెల్లపు వీధి తదితర ప్రాంతాలకు చెందిన 200 కుటుంబాలకు శుద్ధి చేసిన మంచినీటిని సరఫరా చేస్తున్నారు. కేవలం నిర్వహణ కోసం 20 లీటర్ల టిన్నుకు రూ.5 వసూలు చేస్తున్నారు. తక్కువ ధరకు మంచినీరు అందించడంపై ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్లాంట్ తరచూ మరమ్మతులకు గురి కావడంతో మున్సిపాలిటీ నిధులతో మరమ్మతులు చేయించి ప్రజలకు తాగునీరు అందిస్తున్నారు. తొండంగి మండలం పి.అగ్రహారంలోనూ తిరుపతయ్య రూ.4 లక్షలతో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారు.

మున్సిపల్ పార్కులో బెంచీల ఏర్పాటు

గణపతినగర్ మున్సిపల్ పార్కులో ఉదయం, సాయంత్రం సమయాల్లో వందల మంది వాకింగ్ చేస్తున్నారు. వాకింగ్ చేసిన తర్వాత సేద తీరేందుకు వాకర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఇది గమనించిన పలువురు దాతలు సొంత నిధులతో 20 సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. దీంతో వాకర్లు వాకింగ్ చేశాక విశ్రాంతి తీసుకునేందుకు అవకాశం కలిగింది. పార్కు లోపల వ్యాయామం చేయడానికి పరికరాలను, షటిల్ బ్యాడ్మింటన్ కోర్టును పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.


తుని బాడవ తోట పార్కులో దాత సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్

బాలభవన్‌కు ప్రహరీ

బ్యాంకుకాలనీ బాలభవన్ స్కూల్, సచివాలయాలకు టాయిలెట్లు, ప్రహరీ నిర్మాణానికి డెక్కన్ కెమికల్స్ లిమిటెడ్ ప్రతినిధులు రూ.20 లక్షలు విరాళంగా అందజేశారు. ఈ నిధులతో చుట్టూ ప్రహరీ నిర్మాణం పూర్తి చేశారు. నాలుగు టాయిలెట్లు నిర్మాణంలో ఉన్నాయి. దీంతో పాటు మున్సిపల్ ఉన్నత పాఠశాల, మహిళా జూనియర్ కళాశాలకు నిధులు సమకూర్చుతున్నామని డెక్కన్ కెమికల్స్ డైరెక్టర్ కేవీ లక్ష్మీపతిరాజు తెలిపారు.

భవిష్యత్‌తో మరిన్ని సేవా కార్యక్రమాలు



దేవుని చలువతో మా కుటుంబం ఆనందంగా ఉంది. నా సతీమణి కృష్ణకుమారి మమ్మల్ని విడిచి వెళ్లిపోయింది. మా సంపాదనలో కొంత భాగం సేవా కార్యక్రమాలకు ఖర్చు చేయాలని నిర్ణయం తీసుకున్నాం. దీనిలో భాగంగా తుని బాడవతోట పార్కు, తొండంగి మండలం పి.అగ్రహారం గ్రామంలో రెండు ఆర్వో ప్లాంట్లను రూ.8 లక్షలతో ఏర్పాటు చేశాం. ఆ ప్రాంత ప్రజలకు మినరల్ వాటర్‌ను అందుబాటులోకి తెచ్చి సంతృప్తి పొందాం. భవిష్యత్‌లో మరిన్ని సేవాకార్యక్రమాలు చేపడతాం.

–పెనుగొండ తిరుపతయ్య, దాత, తుని

ధూమపానంతో ప్రాణాంతక వ్యాధులు


తునిలో ధూమపానంతో కలిగే అనర్థాల పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న వైద్యులు

తుని: ధూమపానంతో గుండె, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులు వ్యాప్తి చెందుతాయని పలువురు వైద్యులు హెచ్చరించారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ధూమపానానికి దూరంగా ఉండాలన్నారు. జనసంచారం ఉన్న ప్రాంతాల్లో ధూమపానం చేయకూడదన్నారు. చుట్ట, బీడీ, సిగరెట్ తాగడం వల్ల నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, మెదడు సంబంధిత వ్యాధులు వస్తాయన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే ధూమపానానికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ మాలతీరాణి, వైద్యులు వినోద్‌కుమార్, తేజేశ్వరి, సౌజన్యరత్నం, ఎన్టీసీపీ పి.రాఘవలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం


వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు హనుమంతువజ్ఝల అవధాని, ఉపాధ్యాయుల రమేష్, అర్చకులు కోట వంశీ, పరిచారకులు ఫణిశర్మ, పరిచారకుడు యడవిల్లి ప్రసాద్, వ్రత పురోహితులు చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. 31 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్షకుంకుమార్చన

సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలోనూ, కనకదుర్గ అమ్మవారికి ఆలయ అర్చకుడు కంచిభట్ల సాయిరామ్ ఆధ్వర్యంలోనూ పండితులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరాలు


వీరవరం గ్రంథాలయంలో సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు


కిర్లంపూడి: మండలంలోని కిర్లంపూడి, గెద్దనాపల్లి, వీరవరం శాఖా గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. వీరవరం గ్రంథాలయంలో నిర్వహించిన పలు పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు వీరవరం కెనరా బ్యాంక్ మేనేజర్ కేఎస్‌ఏ నరసింహం బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. గ్రంథాలయ అధికార్లు వి.వెంకటేశ్వరరావు, డి.మరిడిబాబు, టీఎస్‌వీఎస్ రాందాసు, చింతల పైడియ్య, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జనసేన శ్రేణుల విజయోత్సవ ర్యాలీ


జగ్గంపేటలో కేక్ కట్ చేస్తున్న జనసేన నేతలు

జగ్గంపేట: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి విజయం సాధించడంతో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు శుక్రవారం జగ్గంపేటలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ నేతలతో కలిసి కేక్ కట్ చేసి జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. బాణసంచా కాల్చి సంబరాలు జరిపారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

ఏఏబీ చైర్మన్ పదవికి రాజీనామా


లంక ప్రసాద్

కోటనందూరు: వ్యవసాయ సలహా మండలి (ఏఏబీ) జిల్లా చైర్మన్ పదవికి రాజీనామా చేసినట్లు మండలంలోని కాకరాపల్లికి చెందిన లంక ప్రసాద్ ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం తన రాజీనామా పత్రాన్ని సంబంధిత అధికారులకు పంపించినట్లు తెలిపారు. గత నాలుగేళ్లుగా రైతులకు మెరుగైన సేవలందించడంలో సహకరించిన జిల్లా, మండల స్థాయి వ్యవసాయశాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా శృంగార వల్లభుని ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ

పెద్దాపురం: శృంగార వల్లభ స్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవ మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. చదలాడ గ్రామానికి చెందిన ఉండవల్లి వారి కుటుంబ సభ్యులు, భక్తుల సహకారంతో ఏర్పాటు చేసిన ధ్వజస్తంభం వద్ద ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేద పండితులు మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. ఈ మహోత్సవానికి ఆయా గ్రామాల నుంచి భక్తులు వందలాదిగా తరలివచ్చారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, ఆలయ చైర్మన్ కర్రి జగదీష్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రహదారి


గోతుల్లో నీరు చేరి ప్రమాదకరంగా ఉన్న ఎస్.అన్నవరం-ఎన్.చామవరం రోడ్డు

తుని రూరల్: మండలంలోని ఎస్.అన్నవరం నుంచి ఎన్.చామవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారి అడగడుగునా గోతులతో ప్రమాదకరంగా మారింది. ఇటీవల ప్రభుత్వం 1063 మంది పేదలకు అందించిన జగనన్న కాలనీలోని ఇళ్ల స్థలాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. నిత్యం వందలాది మంది వెళ్లే ఈ రహదారిలో అడుగడుగునా గుంతలు పడ్డాయి. వర్షం కురిస్తే ఆ గుంతల్లో నీరు చేరి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిని పునర్నిర్మించాలని కాలనీవాసులు, ఎస్.అన్నవరం, ఎన్.చామవరం గ్రామస్తులు కోరుతున్నారు.

ఉద్యాన తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం


ఎంపీడీఓ డేవిడ్ రాజ్

ప్రత్తిపాడు రూరల్: ఉద్యాన తోటల పెంపకానికి ఆసక్తి కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ డేవిడ్ రాజు సూచించారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఐదెకరాల లోపు భూమి, ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగిన వారు ఇందుకు అర్హులని చెప్పారు. వన్- బి, జాబ్ కార్డు, ఆధార్, పట్టాదారు పాస్ పుస్తకం, జెరాక్స్‌లతో ఈ నెల 10వ తేదీలోగా ఉపాధి ఏపీఓ, ఫీల్డ్ అసిస్టెంట్లను సంప్రదించాలని సూచించారు. మామిడి, జీడి మామిడి, నిమ్మ, కొబ్బరి, పామాయిల్, నారింజ, జామ, దానిమ్మ వంటి మొక్కలను ప్రభుత్వం ఉచితంగా ఇవ్వడంతో పాటు తోటలకు నిర్వహణ ఖర్చులు అందజేస్తుందని వివరించారు. పూర్తి వివరాలకు హార్టికల్చర్, ఉపాధి హామీ అధికారులను సంప్రదించాలని సూచించారు.

గోల్డ్ మెడల్ విజేతకు సన్మానం


లింగంపర్తిలో ఉమామహేశ్వరి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

ఏలేశ్వరం: భగవద్గీత పోటీల్లో బంగారు పతకం సాధించిన మండలంలోని లింగంపర్తి గ్రామానికి చెందిన గంటా లక్ష్మీఘనచక్ర ఉమామహేశ్వరిని శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల కాకినాడలోని గణపతి సచ్చిదానందా స్వామి దత్తపీఠంలో భగవద్గీతపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉమామహేశ్వరి విశేష ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించింది. దీంతో లింగంపర్తిలో వివేకానందా సేవాసమితి చైర్మన్ మైరాల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఉమామహేశ్వరి, రమేష్ దంపతులకు శాలువా, పూలమాలతో సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ భగవద్గీత పోటీల్లో ఉమామహేశ్వరి బంగారు పతకం సాధించడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు, తాళ్లూరి గొల్లాజీరావు, పంతం పద్మనాభం, నల్లలశెట్టి వీరబాబు, అడ్డూరి కోటేశ్వరరావు, మల్లేపాక నాగేంద్ర, కుర్ర గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలకు పాల్పడవద్దు


ఎమ్మెల్యే నెహ్రూకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీడీఓ రాజేశ్వరరావు

జగ్గంపేట: ప్రజలు మనపై నమ్మకంతో విజయం అందించారని, విజయోత్సవాలు చేసుకోవాలి తప్ప ఎవరి మీద కక్షపూరిత దాడులకు పాల్పడవద్దని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ టీడీపీ శ్రేణులకు సూచించారు. జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఎన్డీఏ కూటమి మీటింగ్‌లో ఉన్నా రాష్ట్రంలో పలు చోట్ల జరుగుతున్న దాడులపై స్పందించారన్నారు. పార్టీ శ్రేణులు సమయమనం పాటించాలని సూచించారు. రాష్ట్రాభివృద్ధి తమ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

జ్యోతుల నెహ్రూకు శుభాకాంక్షలు

కిర్లంపూడి: సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొందిన జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు శుక్రవారం పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందనలు తెలిపారు. ఎంపీడీఓ బడే రాజేశ్వరరావుతో పాటు మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ తోట రవి, జెడ్పీటీసీ సభ్యుడు తోట గాంధీ, సుబ్బారావు తదితరులు అభినందనలు తెలిపారు.

ప్రజలకు అండగా ఉంటా

గండేపల్లి: నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానని జగ్గంపేట ఎమ్మెల్యేగా గెలుపొందిన జ్యోతుల నెహ్రూ పేర్కొన్నారు. మండలంలోని మల్లేపల్లిలో వేంచేసిన అభయాంజనేయస్వామిని శుక్రవారం ఆయన దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. టీడీపీ నియోజకవర్గ నాయకుడు కుంచె రాజా, పార్టీ మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు, జెడ్ రాగంపేట సర్పంచ్ కందుల చిట్టిబాబు పాల్గొన్నారు.

జ్యోతులను కలసిన ఆర్డీఓ

జగ్గంపేట: పెద్దాపురం ఆర్డీఓ సీతారామరావు జగ్గంపేటలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

బీజేపీ శ్రేణుల విజయోత్సవం

ప్రత్తిపాడు: సార్వత్రిక ఎన్నికల్లో మూడోసారి ఎన్డీఏ కూటమి విజయం సాధించడంతో ప్రత్తిపాడులో శుక్రవారం సాయంత్రం బీజేపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ఎన్డీఏ పక్షనేతగా నరేంద్ర మోదీ ఏకగ్రీవంగా ఎన్నిక కావడంపై బీజేపీ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. బీజేపీ నాయకులు స్థానిక మెయిన్‌రోడ్డులోని మార్కెట్ సెంటర్‌లో బాణసంచా కాల్చి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శింగిలిదేవి సత్తిరాజు, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కించు జోగిరాజు, బీజేపీ నాయకులు మదినే బాబ్జి, కింగుబాబు రాజు, అబ్బిరెడ్డి నూకరాజు, కించు నాగేశ్వరరావు, పి.శ్రీనివాస్, చల్లపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు


సంగవాకలో శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్


గౌరంపేటలో జేసీబీతో వ్యర్థాల తొలగింపు

కోటనందూరు: సీజనల్ వ్యాధులను అధిగమించేందుకు పక్కా ప్రణాళికతో శానిటేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని ఈఓపీఆర్డీ జి.అరుణ్‌కుమార్ తెలిపారు. మండల వ్యాప్తంగా శుక్రవారం డ్రై డే- ఫ్రై డే కార్యక్రమాలు నిర్వహించారు. పాతకొట్టాం పంచాయతీ పరిధిలోని ట్రైబల్ విలేజ్ సంగవాకలో జరిగిన శానిటేషన్ పనులను ఈఓపీఆర్డీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్రమైన ఎండల అనంతరం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. వ్యాధుల నివారణకు పారా మెడికల్, పంచాయతీ సిబ్బందితో పక్కా ప్రణాళిక రచించామన్నారు. పల్లెల్లో నిరంతర పారిశుధ్య పనులతో పాటు ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించేలా చర్యలు చేపట్టామన్నారు. రక్షిత తాగునీటి సరఫరాపై పంచాయతీ సిబ్బందికి ఆదేశాలిచ్చామన్నారు. సీజన్ ముగిసే వరకూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

గౌరంపేటలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ రామిశెట్టి ఏసుబాబు అన్నారు. మండలంలోని గౌరంపేటలో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఏసుబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

వైఎస్సార్ విగ్రహానికి నివాళులు


జగ్గంపేటలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఒమ్మి రఘురాం

జగ్గంపేట: సార్వత్రిక ఎన్నికలు ముగియడంతో ఎలక్షన్ కమిషన్ ఎన్నికల కోడ్‌ను ఎత్తి వేసింది. దీంతో అధికారులు గ్రామాల్లోని రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొలగించారు. జగ్గంపేట బస్టాండ్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి ముసుగు తీయడంతో వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం ఆధ్వర్యంలో రాజన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

వరుణుడిపైనే ఖరీఫ్ ఆశలు

- అడుగంటిన తాండవ జలాశయం
- వేసవి దుక్కులు చేస్తున్న రైతులు
- విత్తనాలు, ఎరువుల పంపిణీకి అధికారుల సన్నద్ధం


అరకొర నీటి నిల్వలతో ఉన్న తాండవ జలాశయం


కోటనందూరులో వేసవి దుక్కు చేస్తున్న రైతు

కోటనందూరు: తాండవ ఆయకట్టు అన్నదాతలను ఈ ఏడాది వరుణదేవుడే రక్షించాలి. ఖరీఫ్ సీజన్‌లో మెట్టలో పొలాలకు నీరు అందించే తాండవ జలాశయం అడుగంటుతోంది. గతేడాది అంతంతమాత్రంగా కురిసిన వర్షాలే ఇందుకు కారణం. ఈ నేపథ్యంలో రైతన్న ఖరీఫ్ సాగులో ముందుకెళ్లాలంటే తప్పక వర్షం కురవాల్సిన అవసరం ఉంది. తాండవ జలాశయానికి ఒక ఆనవాయితీ ఉంది. ఆయకట్టు రైతులు తెగించి విత్తనాలు చల్లితే వరుణుడు కరుణిస్తాడు. ఈ మేరకు రైతులు తాండవ జలాశయంలో నీటి నిల్వలతో సంబంధం లేకుండా ఇప్పటికే ముమ్మరంగా వేసవి దుక్కులు చేస్తున్నారు. విత్తనాలు, ఎరువుల పంపిణీకి వ్యవసాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

51,465 ఎకరాల ఆయకట్టు

తాండవ జలాశయం పరిధిలో 51,465 ఎకరాల ఆయకట్టు ఉంది. అనకాపల్లి జిల్లాలోని కోటవురట్ల, నర్సీపట్నం, నాతవరం మండలాల్లో 32,689 ఎకరాలు, కాకినాడ జిల్లాలో కోటనందూరు, తుని, రౌతులపూడి మండలాల్లో 18,776 ఎకరాల చొప్పున ఆయకట్టు విస్తరించి ఉంది. ఈ ఆయకట్టుకు 20 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న మేజర్, మైనర్ కాలువల ద్వారా సాగునీటిని అందించాల్సి ఉంది. ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు కాగా కనిష్ఠస్థాయి నీటి నిల్వలు 340 అడుగులు. ప్రాజెక్టు నిబంధనల ప్రకారం 370 అడుగుల నీటిమట్టం ఉంటే నీటి విడుదలకు అనుకూలం. ప్రస్తుతం జలాశయంలో 355.4 అడుగుల నీటిమట్టం ఉంది. ఆనవాయితీగా తొలకరి వర్షాలు పడే అవకాశం ఉన్నందున ఆయకట్టు రైతుల అవసరానికి అనుగుణంగా వారి అభీష్టం మేరకు నీటిని విడుదల చేస్తామని తాండవ అధికారులు చెబుతున్నారు.

పూడికతో ముప్పు

తాండవ కాలువల్లో భారీగా పేరుకుపోయిన పూడికతో శివారు ప్రాంతాలకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. గతేడాది కేఈ చిన్నయ్యపాలెం, భీమవరపుకోట మేజర్ కాలువలతో పాటు మైనర్ కాలువల్లో సాగునీరు ముందుకు పారకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. పంట పొట్టదశలో ఉన్నప్పుడు టైలాండు ప్రాంతాలకు సాగునీరు అందక రైతులు నష్టపోయారు. అధికారులు ఏళ్లతరబడి కాలువల్లో పూడిక తొలగించకపోవడమే ఈ దుస్థితికి కారణమని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువల్లో పూడిక తొలగించాలని టైలాండు ప్రాంత రైతాంగం విజ్ఞప్తి చేస్తోంది.

కాలువల్లో పూడిక తొలగించాలి



మండలంలోని తాండవ మేజర్, మైనర్ కాలువల్లో ఎక్కడికక్కడ భారీగా పూడిక పేరుకుపోయింది. గతేడాది చివరిలో శివారు ప్రాంతాలకు సాగునీరు అందకపోవడంతో పంటలు నష్టపోయాం. సమస్యను చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదు. ముందస్తు ప్రణాళికతో అధికారులు పూడిక తొలగింపునకు చర్యలు తీసుకోవాలి.

– కరక అప్పలనాయుడు, రైతు, కేఈ చిన్నయ్యపాలెం

రైతుల అవసరానికి అనుగుణంగా నీటి విడుదల



ఏటా నీటిని విడుదల చేసిన తరువాత ప్రాజెక్టు నిండడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి కనిపిస్తోంది. ప్రస్తుతం నీటి విడుదలకు అవసరమైన నీటి నిల్వలు ప్రాజెక్టులో లేనప్పటికీ రైతుల అవసరానికి అనుగుణంగా వారి అభీష్టం మేరకు నీటిని విడుదల చేసే అవకాశాన్ని పరిశీలిస్తాం. ఆయకట్టు రైతులు ధైర్యంగా విత్తనాలు చల్లుకోవచ్చు.

– పి.అనురాధ, డీఈఈ, తాండవ జలాశయం

భక్తిశ్రద్ధలతో సూర్యదేవుని గ్రామోత్సవం


రాకూరుపాలెంలో సూర్యదేవుని ఉత్సవ విగ్రహాలు ఊరేగిస్తున్న గ్రామస్తులు

గోకవరం: మండలంలోని రాకూరుపాలెంలో సూర్యదేవుని గ్రామోత్సవం శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సనాతన ధర్మ ప్రబోధన స్వచ్ఛంద సమితి సభ్యులు సింహాద్రి నాగేశ్వరరావు, బైరా చిట్టిబాబు, సింహాద్రి రామకృష్ణ, ఆకుల కనకం ఆధ్వర్యంలో ఉషాపద్మినీఛాయా సమేత సూర్యనారాయణస్వామి ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తోట సాయిబాబు, ఉపాధ్యక్షుడు తోట సాయిబాబు, సుబ్బారావు పాల్గొన్నారు.

టీటీ అంపైర్లకు శ్రీప్రకాష్‌లో శిక్షణ

పెద్దాపురం: టేబుల్ టెన్నిస్ అంపైర్లకు తొలిసారి పెద్దాపురం శ్రీప్రకాష్ పాఠశాలలోనే శిక్షణ ఇవ్వనున్నట్టు పాఠశాల డైరెక్టర్, ఏపీ టీటీ అకాడమీ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. స్థానిక శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో శుక్రవారం అంపైర్ల శిక్షణను ఆయన ప్రారంభించారు.